సాక్షి నల్లగొండ

ఆదివారం । 3 । నవంబర్ । 2024



తండ్రీకుమారుడు గల్లంతు

కనగల్ మండలం శాబ్దుల్లాపురం సమీపంలోని ఏఎమ్మార్పీ కాల్వలో స్నానానికి వెళ్లి తండ్రీకుమారుడు గల్లంతయ్యారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.40 అడుగులు
ఇన్‌ఫ్లో	: 48,043 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 48,043 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,273 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,700 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,870 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.60 అడుగులు
ఇన్‌ఫ్లో	: 834 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 834 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 96 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

7 నుంచి సీపీఐ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : సీపీఐ సభ్యత్వ నమోదు ఈ నెల 7 నుంచి ప్రారంభమవుతుందని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి తెలిపారు. శనివారం జరిగిన సీపీఐ నల్లగొండ జిల్లా సమితి కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనె 7నుంచి సభ్యత్వం నమోదు చేపడుతున్నామని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ రైతులు తమ పంటను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉజ్జిని యాదగిరిరావు, పల్లా నర్సింహారెడ్డి, పల్లా దేవేందర్ రెడ్డి, లోడంగి శ్రవణ్‌కుమార్, పబ్బు వీరస్వామి, అంజయ్యచారి, బి.వెంకట్ రమణ, బొల్లుగిరి నర్సింహ, గురిజ రామచంద్ర, వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



మణికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నల్లగొండ టూటౌన్ : ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు నల్లగొండలోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి మణికుమార్ ఎంపికయ్యాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మణికుమార్‌ను శనివారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసింహారావు, హెచ్‌ఓడీ వెంకటేశ్వర్లు, నర్సింహ, విద్యాసాగర్‌రావు, అంజయ్య, సైదులు, అర్జున్ పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రజా ఉద్యమం




మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు అయ్యేందుకుగాను ప్రజా ఉద్యమాలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పి ప్రజా సంపదను నాశనం చేస్తోందన్నారు. ప్రపంచ మానవాళికి కమ్యూనిస్టు సిద్ధాతమే మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, గౌతంరెడ్డి, పాదూరి గోవర్ధిని, చిన్న సైదులు, మంగారెడ్డి, ఆయూబ్, పరుశురాములు, సీతారాములు, చైతన్య, సత్తిరెడ్డి, ధర్మయ్య, సంపత్, సైదులు, భిక్షం, ఇందిరమ్మ, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు 25,754

- జిల్లాలో తొలగించిన ఓట్లు 12,956
- ఓటరు ముసాయిదా జాబితాలో వివరాల వెల్లడి
- కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ
- తుది జాబితా నాటికి మరిన్ని మార్పులు ఉండే చాన్స్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఎన్నికల సంఘం అక్టోబర్ 29న ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారు 25,754 మంది ఉన్నారు. ఎన్నికల సంఘం ఏటా నాలుగు పర్యాయాలు ఓటరు జాబితా సవరణ చేపడుతుంది. ప్రస్తుతం 1 జనవరి, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండేవారు ఓటరు నమోదుకు అవకాశం కల్పించింది. దీంతో 18 ఏళ్లు నిండిన వారితో పాటు గతంలో ఓటు నమోదు చేసుకోని వారు ఇతర ప్రాంతాల నుంచి ఓటు బదిలీ చేసుకున్న వారిని కలుపుకుని మొత్తం 25,754 మంది కొత్తగా ఓటు నమోదు చేసుకున్నారు. వీరిలో పురుషులు 11,762, మహిళలు 13,991, ట్రాన్స్‌జెండర్లు 1 ఓటు కొత్తగా నమోదు చేసుకున్నారు. ఓటరు జాబితా సవరణ ఇంకా కొనసాగుతున్నందున.. ఓటర్ల తుది జాబితా నాటికి కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఇతర ఓట్లు తొలగింపు కూడా పెరిగే అవకాశం ఉంది.

12,956 ఓట్ల తొలగింపు

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సందర్భంగా ఎన్నికల అధికారులు కొత్త ఓట్లు నమోదు చేయడంతో పాటు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన, చనిపోయిన వారి ఓట్లను, రెండు చోట్ల ఓటున్న వారి పేర్లు తొలగిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలో 12,956 మంది ఓట్లను తొలగించారు. అందులో మహిళలు 6,388 కాగా, పురుషులు 6,567 మంది ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు ఒకరు ఉన్నారు. కేటగిరిల వారిగా పరిశీలిస్తే చనిపోయిన వారి ఓట్లు 3,425 ఉన్నాయి. ఇంటింటికి వెళ్లి అన్నీ పరిశీలించాక వారి ఓట్లు తొలగించారు. 7,177 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తమ ఓటును బదిలీ చేసుకున్నారు. దీంతో వారి ఓట్లను కూడా తొలగించారు.

- జిల్లాలో రెండు చోట్ల ఓట్లు నమోదు అయి ఉండటంతో 2,703 ఓట్లను తొలగించారు. అదే విధంగా మరో 47 ఓట్లకు సంబంధించి ఎవరూ ఆ చిరునామాలో లేకపోవడంతో అన్ని వివరాలు పరిశీలించి ఆ ఓట్లను కూడా తొలగించారు.

నేడు మంత్రుల రాక

మిర్యాలగూడ, హుజూర్‌నగర్ : నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు ఆదివారం ముగ్గురు మంత్రులు రానున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దామరచర్ల, హుజూర్‌నగర్, గరిడేపల్లి మండలాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు చేరుకుని పనుల పురోగతిపై సమీక్షించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గట్టు వద్ద నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించే సమావేశంలో మంత్రులు పాల్గొంటారు.

కార్తీక కాంతులు



కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన నల్లగొండలోని ఛాయా సోమేశ్వర ఆలయం



ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

సర్వేలో భాగస్వాములు కావాలి

- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యేల పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, వేదికపై డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేలు, నాయకులు

నల్లగొండ : బీసీ కులగణన, సమగ్ర కుటుంబ సర్వేలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా భాగస్వాములు కావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు పోతోందన్నారు. అందరికీ సమన్యాయం జరగాలని రాహుల్‌గాంధీ ఆదేశానుసారం రాష్ట్రంలో బీసీ కులగణన చేపడుతున్నామని తెలిపారు. గ్రామాల్లో ఉనికి కోల్పోతామని బీఆర్‌ఎస్ నాయకులు బీసీ కులగణనను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో కాంగ్రెస్ పదేళ్లు అధికారంలో ఉండటం ఖాయమన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ సర్వేతో ప్రజల ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని ప్రభుత్వం వారికి కావాల్సిన పథకాలను అందజేస్తుందన్నారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీసీ కులగణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా మన రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారబోతుందన్నారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులంతా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కుల గణన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లాంచీ ప్రయాణం షురూ..



నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం లాంచీ ప్రయాణాన్ని శనివారం జెండా ఊపి ప్రారంభిస్తున్న నందికొండ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

నృసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వయంభూలను మేల్కొలిపారు. అనంతరం ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు.

ట్యాబ్ ఎంట్రీలో జాప్యం చేయొద్దు

- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

తిప్పర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జాప్యం చేయకుండా ట్యాబ్ ఎంట్రీ చేయాలని, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె తిప్పర్తిలోని పీఏసీఎస్, అంతయ్యగూడెం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు, హమాలీలు, కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తిప్పర్తిలో రైతు నాగయ్యను ఎన్నిరోజుల క్రితం ధాన్యం తెచ్చావని కలెక్టర్ అడగగా.. వారం క్రితం తెచ్చానని, తేమ శాతం ఎక్కువగా ఉన్నందున ఇక్కడే ఆరబెట్టుకున్నానని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తేమ శాతం వచ్చిన ధాన్యం వెంటనే కాంటా వేయాలని ఆదేశించారు. కాంటా వేసిన వెంటనే డబ్బులు ఖాతాలో జమయ్యేలా చూడాలన్నారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, తహసీల్దార్ స్వప్న ఉన్నారు.

ధాన్యం సేకరణలో పొరపాట్లకు తావివ్వొద్దు

నల్లగొండ : ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఆమె మాట్లాడారు. సన్న, దొడ్డు రకం ధాన్యానికి ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం హరీష్, డీఏఓ శ్రవణ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

సర్వేకు సిద్ధంగా ఉండాలి

నల్లగొండ : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆమె మాట్లాడారు. సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను ఎన్యూమరేటర్లుగా తీసుకున్నామని తెలిపారు. మొత్తం 4000 మంది ఎన్యూమనేటర్లు అవసరం కాగా, సుమారు 2800 మంది టీచర్లు అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, వివిధ శాఖల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీఆర్పీలను ఎన్యూమరేటర్లుగా తీసుకోవాలని ఆదేశించారు.



ముంచుకొచ్చింది..
ముహూర్తాల వేళ

పెళ్లంటే.. పందిళ్లు, సందళ్లు, తప్పట్లు, తాళాలు తలంబ్రాలు.. మూడే ముళ్లు.. ఏడే అడుగులు మొత్తం కలిపి నూరేళ్లు. ఒకేసారి చేసుకునే ఈ వేడుక జీవితాంతం గుర్తుండిపోయేలా జరుపుకోవాలని ప్రతి ఒక్కరూ ఆశపడుతుంటారు. మారుతున్న కాలంలో పెళ్లి చేసుకునే కొత్త జంటలే కాకుండా.. వారి కుటుంబాలు కూడా పెళ్లి తంతు ఎంతో వైభవంగా.. నలుగురు చెప్పుకుని గుర్తుంచుకునేలా చేయాలని భావిస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

- భువనగిరి, రామగిరి (నల్లగొండ), భానుపురి (సూర్యాపేట)



ఐదు నెలలపాటు పెళ్లిసందడి

- ఒక్కటికానున్న వేలాది జంటలు
- పురోహితుడి నుంచి వంట మాస్టర్ వరకు అంతా బిజీబిజీ
- ఫంక్షన్‌హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు డిమాండ్
- కల్యాణ మండపాల అలంకరణకు అత్యంత ప్రాధాన్యం
- ప్రీ వెడ్డింగ్ షూట్స్‌కు పెరిగిన క్రేజ్

పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. కార్తీక మాసం ప్రారంభం కావడంతో వరుసగా జనవరి మినహా ఏప్రిల్ వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ ఐదునెలల కాలంలో వేలాది కొత్త జంటలు ఒక్కటి కానున్నాయి. ఈ నేపథ్యంలో కన్వెన్షన్ సెంటర్లు, బాంకెట్ హాళ్లు, ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరిగింది. మరోవైపు వధూవరుల పెళ్లి షాపింగ్‌తో దుకాణాలు సందడిగా మారాయి. పెళ్లి తంతులో భాగస్వాములయ్యే ప్రతి ఒక్కరికీ డిమాండ్ పెరగనుంది. అంగరంగ వైభవంగా వివాహ వేడుకలను తీర్చిదిద్దేందుకు వెడ్డింగ్ ప్లానర్లు, అలంకరణ డిజైనర్లు తమ పనుల్లో బిజీగా మారారు. ఇక పురోహితులు, వంట మాస్టర్, క్యాటరింగ్, పెళ్లి మండపం డిజైనర్లు, మెహందీ డిజైనర్లు, ఫొటోగ్రాఫర్లు, బాజా భజంత్రీలకు ఈ ఐదు నెలల పాటు మంచి ఉపాధి దొరకనుంది.

ఫంక్షన్ హాల్ ప్రధానం

పెళ్లికి ముమూర్తం ఎంత ప్రధానమో.. ప్రస్తుతం ఫంక్షన్ హాల్ కూడా అంతే. రెండు, మూడు ముహూర్తాలు చూడడం.. తమకు నచ్చిన ఫంక్షన్ హాల్ ఏ తేదీన ఖాళీగా ఉందో చూసుకుని దాన్నే ఫిక్స్ చేస్తున్నారు. ఇరుకుటుంబాలు వివాహానికి ఓకే చెప్పగానే మొదటగా ఫంక్షన్‌హాల్‌ను వెతుకుతున్నాయి. ఆర్థిక స్థోమతను బట్టి ఒక్కో ఫంక్షన్ హాల్‌కు రూ.20 వేల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక స్థాయిని బట్టి కల్యాణ మండపాల అలంకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందు కోసం బాంకెట్ హాల్, పార్టీ లాన్స్, కన్వెన్షన్ హాల్‌కు రోజుకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు.

మంచి ముహూర్తాలు ఇవే..

కార్తీక మాసం ప్రారంభం కావడంతో ఉగాది వరకు శుభ ముహూర్తాలు ఉంటాయి. జనవరిలో వచ్చే సంక్రాంతి సమయంలో కొద్ది రోజులు ముహూర్తాలు లేకున్నా వచ్చే ఏడాది మార్చి వరకు ఐదు నెలలు శుభ ముహూర్తాలు ఉన్నాయి. నవంబర్ నెలలో 3, 7, 8, 13, 14, 17, 22, 23, 25, 28, 29 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఆ తర్వాత మార్గశిర మాసం డిసెంబర్‌లో 3, 4,5, 6,9, 11,14, 15 తేదీల్లో ముహూర్త బలం ఉంది. వచ్చే ఏడాది (2025 సంవత్సరంలో) మాఘమాసంలో జనవరి 31 నుంచి మొదలు కొని ఫిబ్రవరి 2, 7, 8, 13, 14, 16, 20, 22, 23 తేదీలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. పాల్గుణ మాసం మార్చిలో 1, 6 తేదీల్లో మంచి బలమైన ముహూర్తాలున్నాయి. ఇక ఉగాది తర్వాత నూతన పంచాంగం బట్టి ముహూర్తాలు నిర్ణయిస్తారు.

సండే స్పెషల్




ప్రీ వెడ్డింగ్ షూట్ తప్పనిసరి

ఒకప్పుడు వివాహ వేడుకలు సాధారణంగా జరిగేవి. ప్రస్తుతం లగ్జరీగా ఉండాలని వధూవరులు భావిస్తున్నారు. ఖర్చుకు వెనుకాడడం లేదు. చాలామంది ఈవెంట్ మేనేజర్లతో పెళ్లి నడిపిస్తున్నారు. పెళ్లి కూతురు, కొడుకును చేసే సమయం నుంచి వివాహమై వ్రతాలు చేసేదాకా గంపగుత్తగా ఇంత మొత్తం అని మాట్లాడుకుంటున్నారు. ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్, హల్దీ, రిసెప్షన్ ఇలా అన్నీ వారికే అప్పగిస్తున్నారు. కొత్తగా ఒక్కటి కాబోయే జంటలకు ప్రీ వెడ్డింగ్ ఫొటో షూట్ తప్పనిసరైంది. ఈ షూటింగ్‌ల కోసం వైజాగ్, హైదరాబాద్, ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్తున్నారు. ఒక్కో ప్రీ వెడ్డింగ్ షూట్‌కు సుమారు రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. దీంతో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లకు మంచి డిమాండ్ ఉంది.

అన్ని రకాల వ్యాపారులకు సువర్ణావకాశం

పెళ్లిళ్ల సీజన్ అనేది బడా వ్యాపారులకే కాదు చిన్న వ్యాపారులకు కూడా సువర్ణావకాశం. శుభలేఖలు ప్రింట్ చేసే ప్రెస్‌లు, ఫొటోగ్రాఫర్లు, టెంట్‌హౌజ్‌లు, వంట మాస్టర్లు, క్యాటరింగ్ బా య్స్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవారు, మంగళ వాయిద్యకారులు, డీజే మ్యూజీషియన్లు, స్పీకర్లు అద్దెకు ఇచ్చేవాళ్లు ఇలా చాలా వస్తువులు, సేవలు పెళ్లిళ్లతో ముడిపడి ఉంటాయి. వెడ్డింగ్ సీజన్‌లో ఈ వ్యాపారాన్నీ క్షణం తీరికలేకుండా నడుస్తాయి. ఇక షాపింగ్ మాల్స్, గోల్డ్ షాపుల్లో అమ్మకాలు కూడా భారీగా పెరగనున్నాయి.





అభిరుచి మేరకు ఏర్పాట్లు చేస్తాం



ఈవెంట్ల కోసం రెండు, మూడు నెలల ముందు నుంచే ప్లాన్ చేస్తాం. ప్రస్తుతం చాలా మంది ఎలాంటి రిస్క్ తీసుకోకుండా వివాహాలు ఘనంగా జరిపించాలని చూస్తున్నారు. వారి అభిరుచి మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. నాలుగైదు నెలల పాటు ముహూర్తాలు ఉన్నందున మావద్ద పనిచేసే వారికి ఉపాధి దొరుకుతోంది.ఈవెంట్ల కోసం స్థానికంగా లేదంటే హైదరాబాద్ నుంచి సిబ్బందిని తీసుకొస్తుంటాం.

- పద్మజ, ఈవెంట్ మేనేజర్, సూర్యాపేట

బుకింగ్‌లు నడుస్తున్నాయి



మంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఫంక్షన్ హాల్ బుకింగ్‌లు ఇప్పటికే నడుస్తున్నాయి. ఫిబ్రవరి వరకు పలు తేదీల్లో బుక్ అయ్యింది. కస్టమర్లు మంచి డిజైన్లతో మండపాలు కావాలని అడుగుతుంటారు. వారి అభిరుచి మేరకు డెకరేషన్ చేయిస్తాం.

- సంతోష్‌రెడ్డి, ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు, సూర్యాపేట

పెళ్లిళ్లకు అనువైన సమయం



మూడు నెలలు ముహూర్తాలు లేకపోవడంతో పెళ్లిళ్లు, శుభకార్యాలు నిలిచిపోయాయి. డిసెంబర్ 26 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. జనవరి నెలలో మూడాలు వచ్చాయి. మళ్లీ ఫిబ్రవరి నెలలో శుభ ఘడియలు ఉంటాయి. పెళ్లిళ్లు చేసుకోవాలనుకునే వారికి ప్రస్తుతం అనువైన సమయం.

సురేంద్ర శర్మ, పురోహితుడు, నల్లగొండ

క్లుప్తంగా

జాతీయ రహదారిపై కారు దగ్ధం



దగ్ధమవుతున్న కారు

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీ య రహదారిపై చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులో కారు దగ్ధమైంది. శుక్రవారం అర్ధరాత్రి నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో గుండ్రాంపల్లి శివారులోకి రాగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన కారు డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి కారులోంచి బయటికి రావటంతో ప్రాణ పాయం తప్పింది. గుండ్రాంపల్లి గ్రామస్తులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా ఫైరింజన్ వచ్చేలోపే కారు పూర్తిగా కాలిబూడిదయ్యింది. కారులోని వ్యక్తి వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు రాలేదని చిట్యాల పోలీసులు శనివారం తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మేళ్లచెరువు: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మేళ్లచెరువు మండల కేంద్రంలో శనివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, మేళ్లచెరువు ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడకు చెందిన సింహాద్రి నాగరాజు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు మేళ్లచెరువులోని తన మిత్రుల కోసం 250 గ్రాముల గంజాయిని ఒరిస్సా రాష్ట్రం నుంచి కొనుగోలు చేసి ట్యాంకర్‌లో తీసుకొని వస్తుండగా పక్కా సమాచారం మేరకు శనివారం ఉదయం మేళ్లచెరువు మండల కేంద్రంలోని హుజూర్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద మేళ్లచెరువు పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. దొరికిన గంజాయి విలువ రూ.1000 ఉంటుందని తెలిపారు. నిందితుడిని పట్టుకున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ పరమేష్, కానిస్టేబుళ్లను సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అభినందించారు.

రెండు ద్విచక్ర వాహనాలు చోరీ

చౌటుప్పల్ : దుకాణం ముందు పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీకి చెందిన కొంపల్లి మధు అక్టోబర్ 29వ తేదీ రాత్రి తన పల్సర్ బైక్‌ను స్థానిక జగన్నాథ్ ట్రేడర్స్ దుకాణం ముందు పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు తెల్ల వారుజామున చూడగా బైక్ కన్పించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా, తెలిసినవారిని వాకబు చేసినా ఫలితం లేకుండాపోయింది. అదేవిధంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మార్కండేయనగర్ కాలనీకి చెందిన గోశిక ధనుంజయ్య తన స్ప్లెండర్ బైక్‌ను జగన్నాథ్ ట్రేడర్ దుకాణం ముందు అక్టోబర్ 23వ తేదీ రాత్రి పార్కింగ్ చేశాడు. మరుసటిరోజు తెల్లవారుజామున చూడగా బైక్ కన్పించలేదు. స్థానికంగా ఎంత వెతికినా బైక్ ఆచూకీ లభించలేదు. ఇరువురు బాధితులు శనివారం చౌటుప్పల్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- 26మంది ప్రయాణికులకు గాయాలు.. వారిలో ఏడుగురికి తీవ్రగాయాలు
- కోదాడ వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఘటన



ధ్వంసమైన సూపర్ లగ్జరీ బస్సు ముందుభాగం, రోడ్డు కిందకు వెళ్లిన ట్రావెల్స్ బస్సు



కోదాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కోదాడరూరల్: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 26 మంది ప్రయాణికులకు గాయాలు కాగా వారిలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్ వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. హైదరాబాద్ నుంచి మహి ప్రైవేట్ ట్రావెల్ బస్సు శుక్రవారం అర్ధరాత్రి 12గంటల తర్వాత ప్రయాణికులతో రాజమండ్రికి బయల్దేరింది. శనివారం తెల్లవారుజామున రెండున్న గంటల సమయంలో బస్సు కోదాడ పట్టణ పరిధిలోని కట్టకమ్ముగూడెం క్రాస్‌రోడ్ వద్దకు చేరుకోగా.. ఓ ప్రయాణికురాలు మూత్రవిసర్జన చేసేందుకు బస్సును ఆపమనడంతో డ్రైవర్ హైవే పక్కన బస్సును నిలిపాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న టీజీఎస్ ఆర్టీసీకి చెందిన సూపర్ లగ్జరీ బస్సు ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది.

ఉలిక్కిపడిన ప్రయాణికులు..

ఈ ఘటనతో రెండు బస్సుల్లో గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. సూపర్ లగ్జరీ బస్సు వేగంగా ఢీకొట్టడంతో ట్రావెల్స్ బస్సు రోడ్డు కిందకు దూసుకెళ్లి ఆగింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోని 26 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. నిద్రమత్తు నుంచి తేరుకున్న ప్రయాణికులు ఏం జరిగిందో తెలియక గాయాలు కావడంతో ఆర్తనాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన నవ్య, ఆదిత్య, తేజ, డేవిడ్ కోదాడలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వరరావు, కె. మణి, దానియేలు పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ కొత్తపల్లి లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ పట్టణ సీఐ రాము తెలిపారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో వాహనాలు భారీగా నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రమాదానికి గురైన బస్సును రోడ్డు పక్కకు తప్పించి పోలీసులు వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

కాలువలో తండ్రి, కుమారుడు గల్లంతు

- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు
- స్నానానికి వెళ్లి వరద ఉధృతికి కొట్టుకుపోయిన వైనం



కుమారుడు ఫణీంద్రవర్మతో దామోదర్

కనగల్: మండలంలోని శాబ్దుల్లాపురం గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ కాల్వలో స్నానానికి వెళ్లి తండ్రీకుమారుడు గల్లంతయ్యారు. చండూరు సీఐ ఎ. వెంకటయ్య, కనగల్ ఎస్‌ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన సురవరం దామోదర్(40)కు భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. దామోదర్ కుటుంబంతో కలిసి నల్లగొండ మండలం బుద్దారం గ్రామంలో తన అత్తగారింటి వద్ద నివాసముంటూ మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. దీపావళి పండుగను పురస్కరించుకొని శుక్రవారం రాత్రి దామోదర్, అతడి కుమారుడు ఫణీంద్రవర్మ (14) స్వగ్రామానికి వచ్చారు. దామోదర్‌తో పాటు కుమారుడు ఫణీంద్రవర్మ, తన అన్న కుమారులైన సురవరం జగన్, ప్రణవ్‌సాయి కలిసి శనివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని ఏఎమ్మార్పీ కాల్వ వద్దకు స్నానం చేసేందుకు వెళ్లారు. కాల్వ మెట్ల వద్ద స్నానం చేస్తున్న క్రమంలో ఫణీంద్రవర్మ ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి కొట్టుకుపోతుండగా అతడిని కాపాడేందుకు దామోదర్ కాల్వలోకి దూకాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ఇద్దరూ కొట్టుకుపోయారు. కాలువ ఒడ్డున ఉన్న జగన్, ప్రణవ్‌సాయి వెంటనే గ్రామానికి పరుగు తీసి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా.. ఘటనా స్థలానికి ఎస్‌ఐ విష్ణుమూర్తి, చండూరు సీఐ వెంకటయ్య చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గాలించినా దామోదర్, ఫణీంద్రవర్మ ఆచూకీ లభించలేదు. ఫణీంద్ర వర్మ నల్లగొండలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ రామగిరి బాయ్స్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ఫణీంద్ర వర్మ గత 15 ఏళ్ల కాలంలో గ్రామానికి రావడం ఇది కేవలం మూడో సారి మాత్రమే అని కుటుంబ సభ్యులు రోదిస్తూ తెలిపారు. తండ్రీకుమారుడు గల్లంతు కావడంతో శాబ్దుల్లాపురం గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. దామోదర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూసీ నదిలో పడి వృద్ధుడి మృతి..

బీబీనగర్: గేదెలను మేపేందుకు వెళ్లిన వృద్ధుడు మూసీ నదిలో పడి మృతిచెందాడు. ఈ ఘటన బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రాలదండి గ్రామ పరిధిలోని కుచ్చుబోడుతండాకు చెందిన ధరావత్ హరిలాల్‌నాయక్(80) తన పాడి గేదెలను తండా సమీపంలో గల మూసీ నది ఒడ్డున మేపేందుకు శుక్రవారం ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. హరిలాల్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. తిరిగి శనివారం ఉదయం మూసీ నది వద్ద వెతకగా నదిలో హరిలాల్‌నాయక్ మృతదేహం కనిపించింది. వెంటనే మృతదేహాన్ని బయటకు తీశారు. గేదెలు మూసీ నది అవతలి ఒడ్డుకు వెళ్లడంతో వాటిని కొట్టుకొచ్చేందుకు నదిలోకి దిగిన హరిలాల్‌నాయక్ ప్రమాదవశాత్తు నదిలో మునిగి మృతి చెందినట్లు స్థానికులు భావిస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యం



కుమార్తెతో మంజుల

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : కుటుంబ కలహాల కారణంగా కుమార్తెతో కలిసి మహిళ కనిపించకుండా పోయింది. ఈ ఘటన తిరుమలగిరి మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన మారుపాక ఊషయ్యకు నిడమనూరు మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన భాషపాక మంజులతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంజుల శుక్రవారం సాయంత్రం తన కుమార్తె జోష్ణవిని తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఎంత వెతికినా వారి ఆచూకీ తెలియకపోవడంతో మంజుల తండ్రి నాగయ్య శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి ఆచూకీ తెలిసినవారు 87126 70199 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు.

41 బైక్‌లు సీజ్



పోలీసులు సీజ్ చేసిన బైక్‌లు

నల్లగొండ క్రైం: నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించి నంబర్ ప్లేట్లు లేని వాహనాలతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారి వాహనాలు సీజ్ చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అధిక శబ్దం వచ్చే బుల్లెట్ బైక్‌ల సైలెన్సర్లు తొలగించినట్లు పేర్కొన్నారు.

బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులో ఈతకు వెళ్లి..



శంకరయ్య (ఫైల్)

నార్కట్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులో ఈతకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామానికి చెందిన గుండాల శంకరయ్య(52) తన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగకు చిట్యాల మండలం నేరడ గ్రామంలో ఉంటున్న తన వియ్యంకుడి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో శంకరయ్య శనివారం సాయంత్రం నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల సమీపంలోని ప్రాజెక్టులో నీటిని చూసేందుకు వెళ్లాడు. ప్రాజెక్టులోకి దిగి ఈత కొడుతుండగా ఊపిరాడక నీటిలో మునిగి మృతి చెందాడు. మృతదేహం కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

పన్నీరు తయారీ కేంద్రంపై పోలీసుల దాడులు

- అపరిశుభ్ర వాతావరణంలో పన్నీరు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్



ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న పన్నీరు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పన్నీరు తయారీ కేంద్రంపై శనివారం ఎస్‌ఓటీ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఎస్‌ఓటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలో మున్నా మియా అనే వ్యక్తి ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ లేకుండా అపరిశుభ్రమైన వాతావరణంలో పెద్దఎత్తున పన్నీరు తయారుచేసి హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పలు హోటళ్లు, దాబాలకు విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం మేరకు మున్నా మియా పన్నీరు తయారీ కేంద్రంపై దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేసిన పన్నీరును హోటళ్లు, దాబాల నిర్వాహకులు కొనుగోలు చేయొద్దని ఎస్‌ఓటీ పోలీసులు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతి

సూర్యాపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. గుర్తుతెలియని మహిళ(40) శనివారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగామ క్రాస్‌రోడ్ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి సూర్యాపేట పట్టణ పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

ఉరేసుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్ బలవన్మరణం



రవిశంకర్ (ఫైల్)

నల్లగొండ క్రైం: ఆర్థిక సమస్యలతో ఉరేసుకుని ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని పూజితా అపార్ట్‌మెంట్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టుకు చెందిన కటుకూరి రవిశంకర్(42) నల్లగొండ పట్టణంలోని పూజితా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నాడు. అతడికి భార్య స్వాతి, కుమార్తె నీతుశ్రీ, కుమారుడు సాకేత్ ఉన్నారు. రవిశంకర్ యాదగిరిగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు పనిచేస్తున్నాడు. రవిశంకర్ శనివారం విశ్రాంతి తీసుకుంటానని కుటుంబ సభ్యులతో చెప్పి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి లోపల నుంచి గడియ పెట్టుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత అతడి కుమార్తె తలుపును గట్టిగా కొట్టడంతో తలుపు తెరుచుకోగా.. తన తండ్రి విగతజీవిగా కనిపించడంతో గట్టిగా అరవడంతో హాల్‌లో ఉన్న రవిశంకర్ భార్య వచ్చి అతడిని కిందకు దించగా.. అప్పటికే మృతిచెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆర్థిక సమస్యల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి వెంకటమ్మ నల్లగొండ టూటౌన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. రవిశంకర్ గతంలో నల్లగొండ జిల్లా కేంద్రంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. మృతుడి భార్య స్వాతి ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తోంది.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి దుర్మరణం



గణేష్ (ఫైల్)

కోదాడరూరల్: బైక్‌పై వెళ్తున్న యువకుడు ముందు ఆగి ఉన్న లారీని తప్పించబోయి పక్కనే ట్రాక్టర్‌ను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణ పరిధిలోని గుడిబండ రోడ్డులో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన రాజపుత్ర గణేష్(21) కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో ఉంటున్న తన అక్క ఇంటికి దీపావళి పండుగకు వచ్చాడు. తిరిగి కోదాడ నుంచి కొండపల్లికి బైక్‌పై వెళ్తుండగా గుడిబండ రోడ్డు మూలమలుపులో ఆగి ఉన్న లారీని తప్పించబోయి పక్కనే బ్రిక్స్ తయారీలో ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రం గాయపడిన గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ సత్యరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము పోలీసులు తెలిపారు.

వంగ పంటలో తెగుళ్లు - నివారణ చర్యలు

నడిగూడెం: వంకాయ(వంగ) సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు. కొద్దిరోజులుగా చలి తీవ్రత పెరుతోందని, దీంతో చీడపీడల సమస్యలు పెరిగే అవకాశం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు వహించాలని ఆయన సూచించారు. వంగ తోటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ చర్యలు ఆయన మాటల్లోనే..

మొవ్వు, కాయతొలుచు పురుగు: ఈ పురుగు పంట నాటిన 30–40 రోజుల నుంచి ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, తర్వాత దశలో కాయలను తొలిచి నష్టాన్ని కలుగజేస్తుంది. కాయలు వంకర్లు తిరిగిపోతాయి. కొమ్మల చివర్ల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు గాను ఈ పురుగు ఆశించిన కొమ్మలను తుంచివేయాలి. తొలిదశలో వేప నూనె లీటరు నీటికి 5 మి.లీ. లేదా కార్బరిల్ 50శాతం 3 గ్రాములు, లీటరు నీటికి, లేదా ప్రొఫెనోఫాస్ 2.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

రసం పీల్చే పురుగులు(దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ): ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వలన ఆకులు పసుపు రంగుకు మారి పైకి ముడుచుకొని ఎండిపోతాయి. వీటి నివారణకు డైమీథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఎర్రనల్లి: ఈ పురుగు ఆకుల అడుగు భాగాన చేరి, రసం పీల్చడం వలన ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలెగూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆకుమాడు తెగులు: నారును పొలంలో నాటిన తర్వాత 30 రోజులకు ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులన్నీ మాడిపోయినట్లుగా కనిపిస్తాయి. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తర్వాత పసుపురంగుకు మారి వాడి రాలిపోతాయి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు, లేదా కార్బెండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

ఆకుమాడు మరియు కాయకుళ్లు తెగులు: ఆకులమీద అక్కడక్కడ గోధుమ రంగుతో కూడిన మచ్చలు కన్పిస్తాయి. తెగులు ఉధృతమైతే ఆకులు మాడి రాలిపోతాయి. తెగులు సోకిన కాయలు పసుపురంగుకు మారి కుళ్లిపోతాయి. దీని నివారణకు నారుమడిలో విత్తేముందు 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల వీటిలో విత్తనాలను 30 నిమిషాల పాటు నానబెట్టి విత్తుకోవాలి. తెగులు సోకిన పొలంలో పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.



వంగ పంట

వెర్రి తెగులు : ఆకులు సన్నగా మారి, పాలిపోయిన ఆకుపచ్చని రంగు కల్గి ఉంటాయి. మొక్కలు గుబురుగా చీపురుకట్టలా కనబడతాయి. పూత, కాత లేకుండా మొక్కలు గొడ్డు బారిపోతాయి. ఇది వైరస్ తెగులు. దీని నివారణకు ఆశించిన మొక్కలను తొలగించి నాశనం చేయాలి. నారుదశలో నాటడానికి ముందు 250 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ నారుమడికి వేయాలి.

- ❖ ప్రధానంగా పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి.
- ❖ అంతరపంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి పంటలు వేసుకోవాలి.
- ❖ లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4 చొప్పున పెట్టాలి.
- ❖ తలనత్త ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందికి తుంచి నాశనం చేయాలి.
- ❖ అల్లిక రెక్కల పురుగులను మొక్కకు 2 చొప్పున పంట పెరిగే దశలో విడుదల చేయాలి.
- ❖ ఎకరానికి 200కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి.

పాడిపంట